క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



సామూహిక వ్రతం ఆచరిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సత్య నిష్ట అనేది వెయ్యి అశ్వమేధ యాగాలతో సమానమన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో పండితులు వెంకటేశ్వర శర్మ, విశ్వనాథశర్మ, హరిశర్మ, మహేష్‌శర్మ, తదితరులు భక్తులతో శాస్త్రోక్తంగా సామూహిక వ్రతం చేయించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో సత్య నిష్ట నెలకొల్పాలని సత్యనారాయణ స్వామి వ్రతం చేయిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చోళవేటి లక్ష్మీనారాయణ,కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ

శిరివెళ్ల: ఎంఈఓ-1గా శంకర్ ప్రసాదు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతేడాది మే 30న మహమ్మద్ హుసేని పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో గోస్పాడు మండలంకు కరీంబాషా, ఆ తర్వాత ఆళ్లగడ్డకు చెందిన శోభా వివేకవతి ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా వ్యవహరించారు. ఇటీవల ఎంఈఓ - 2 గా నాగార్జునరెడ్డి విధుల్లో చేరారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం



దాసన్న

ఉయ్యాలవాడ : స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఏపీఎంగా దాసన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శేఖర్ సంజామల మండలానికి బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలంలో బాధ్యతలు నిర్వహిస్తున్న దాసన్న ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో మండలానికి వచ్చారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): శానిటేషన్ వర్కర్స్‌కు వేతనాలు పెంచి ఆప్కోస్‌లో చేర్చాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, బాలకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో వివిధ రంగాల్లో శానిటేషన్ స్వీపర్స్, పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్, మున్సిపల్ స్కూళ్లలో పని చేసే ఆయాలకు వేతనాలు పెంచాలని కోరారు. జీవో 549 ప్రకారం రూ.16వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.నాయకులు సుబ్బయ్య, ఈశ్వరమ్మ, పెంచలమ్మ, సలామీ, సరళమ్మ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ



బరేబోయిన సంటెమ్మకు పింఛన్ అందచేస్తున్న వలంటీర్ సుధాకర్

చాగలమర్రి: అవులపల్లె గ్రామానికి చెందిన బరేబోయిన సంటెమ్మ వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ సుధాకర్ సోమవారం అక్కడికి వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛన్ అందజేశాడు.

దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

నంద్యాల(సిటీ): పట్టణంలోని దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పద్మావతి నగర్ ప్రాంతంలోనున్న పలు దుకాణాలను తనిఖీ చేసి వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్‌లతో మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందాలని, నిర్ణీత గడువులోగా క్లాప్ యూజర్ ఫీజు చెల్లించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేయకూడదన్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల గడువు పూర్తి అయితే వెంటనే సంబంధిత వార్డు శానిటరీ సెక్రటరీతో రెన్యూవల్ చేయించకోవాలని చెప్పారు. శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ సిబ్బంది రాజశేఖర్ ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోండి

ఉయ్యాలవాడ : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వైద్య శిబిరం హరివరం గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ మాట్లాడుతూ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉయ్యాలవాడ 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 104 వాహనంలో వైద్య బృందం తరలివెళ్లి గ్రామస్తులకు వైద్య సేవలందించారు. హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

వరి సాగుకు వేళాయే

- నారుమళ్ల తయారీలో నిమగ్నమైన అన్నదాతలు
- బోర్ల కింద నాట్లకు సిద్ధం
- అడపాదడపా కురుస్తున్న వానలతో ముందడుగు



నంద్యాల వద్దనున్న కుందూ వంతెన పక్కన పొలంలో వరి నారుమడి

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ సాగు పనులను రైతులు ముమ్మరం చేశారు. పొలాన్ని దుక్కిచేయటం, నారుమళ్లను సిద్ధం చేయటం, వరి విత్తనం కొనుగోలు తదితర పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య నుంచే ప్రారంభమైన ఎండలు జూన్ చివరి వారం వరకు హడలెత్తించగా...గడిచిన పదిరోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలు వాతావరణాన్ని కాస్త చల్లబరిచాయి. ఏటా జూన్ రెండో వారం నుంచే రైతులు సాగు పనులు చేపడుతుండగా, ఈసారి వర్షాలు ఆలస్యం కావటంతో ఎదురు చూస్తున్నారు. కొందరు బోర్ల కింద గత వారం నుంచి వరి నార్లు పోస్తున్నారు.

67,890 హెక్టార్లలో సాగు..

జిల్లాలో ఈ ఏడాది 67,890 హెక్టార్లలో వరి పంట సాగు చేసే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా కేసీ, తెలుగుగంగ, వెలుగోడు, అవుకు, గోరుకల్లు జలాశయాలతో పాటు చెరువులు, చిన్న నీటి వనరుల కింద విస్తారంగా వరి పండిస్తారు. గతేడాది ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి రావడంతో పాటు ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయటంతో అన్నదాతలు మంచి ఆదాయం పొందారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు.

ముమ్మరంగా నారుమళ్లు

వారం నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలతో పొలాలు నార్లు పోసేందుకు అనువుగా తయారయ్యాయి. దీంతో రైతులు వరినారు పోస్తున్నారు. ఓ పక్క నారుమళ్లు సిద్ధం చేస్తూనే మరో పక్క విత్తనాలు సేకరించే పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే రైతులకు సరిపడా విత్తనాల్ని రైతు భరోసా కేంద్రాలతో పాటు, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, ఆత్మకూరు, బనగానపల్లె, మహానంది కృషి విజ్ఞాన కేంద్రాల్లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లోని దుకాణాలు సైతం విత్తనాల కొనుగోలు కోసం వస్తున్న రైతన్నలతో కిటకిటలాడుతున్నాయి.

బోర్ల కింద మరో 20 రోజుల్లో నాట్లు..

బోర్ల కింద ఈ నెల మూడో వారంలో వరి నాట్లు పడే అవకాశం ఉంది. ఇప్పటికే పశువుల ఎరువులు, సూక్ష్మ పోషకాలతో పొలాలను కలియదున్ని సిద్ధం చేస్తున్నారు. పలుచోట్ల పచ్చిరొట్ట పంటలు సైతం దుక్కిదున్నే దశకు చేరుకున్నాయి.

మొత్తం వరి పంట సాగు చేస్తాను



నాకున్న సొంత పొలంతో పాటు సుమారు 35 ఎకరాల వరకు కౌలుకు తీసుకున్నాను. మొత్తం పొలంలో వరి పంట సాగు చేయాలని నిర్ణయించుకున్నా. ఇందుకు నారుమళ్లు సిద్ధం చేస్తున్నా. నంద్యాల సోనా రకానికి సంబంధించిన విత్తనం ఇప్పటికే సిద్ధం చేసుకున్నాను. వరుణుడు కరుణిస్తే మరింత వేగంగా పనులు జరుగుతాయి.

– ఆల మోహన్, రైతు, గోరుకల్లు

మెళకువలు పాటిస్తే మేలు

రైతులు వానాకాలంలో మెళకువలు పాటించి సాగు పనులు చేపట్టాలి. నేల పూర్తిగా పదునైన తర్వాతే వరినార్లు పోయాలి. పొలాల్లో పచ్చిరొట్టె విత్తనాలు చల్లుకుని అవి ఎదిగిన తర్వాత దున్ని దమ్ము చేస్తే భూసారం పెరుగుతుంది. ఎరువులు, విత్తనాలు సంబంధిత ఆర్‌బీకేల్లో ఇప్పటికే సిద్ధంగా ఉంచాం.

– హేమసుందరరెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, నంద్యాల సబ్‌డివిజన్

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, పీపీ నాగిరెడ్డి

నంద్యాల(రూరల్): అన్ని వర్గాల ప్రజల సంక్షమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అయ్యలూరు గ్రామంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లను ప్రారంభించారు. అలాగే నాడు–నేడు ద్వారా రూ.23 లక్షలతో ప్రభుత్వ పాఠశాలను రూపుదిద్దారు. కార్యక్రమంలో మండలం సచివాలయ కన్వీనర్ బసవేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కో–ఆర్డినేటర్ పీపీ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీటీసీ రషీద్, వైస్ సర్పంచ్ శివ లలిత, సర్పంచ్, దావీద్, షఫీ పాల్గొన్నారు.

పథకాలతో ప్రజలు సుభిక్షం



పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తుండటంతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రూరల్ మండలం మర్రిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, స్థానిక నాయకులతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి పథకాల అమలు, లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, నాయకులు తులసి, రామకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి ఉన్నారు.

నేడు పసురపాడులో 'జగనన్న సురక్ష'

గోస్పాడు: మండలంలోని పసురపాడు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లోనే మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో ప్రజలకు కుల, ఆదాయ, జనన, మరణ, సీసీఆర్సీ కార్డులు, రేషన్ కార్డు డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్ తదితర 11 రకాల ధ్రువ పత్రాలు అందజేస్తామని చెప్పారు.


దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక సచివాలయ పరిధిలో కార్యక్రమం ఏర్పాటు చేశామని మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాయ ఉద్యోగుల హాజరు కావాలనిసూచించారు. అర్హులందరికీ ఉచితంగా ధ్రువ పత్రాలు అందజేస్తామని చెప్పారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



రుద్రవరంలో నివేదికలను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించాలని ఉపాధి హామీ పథకం అడిషనల్ పీడీ సలీం బాషా సూచించారు. సోమవారం ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో అడిషనల్ పీడీ బహిరంగ సమావేశం నిర్వహించి ఎఫ్‌ఏల పని తీరు చేసిన అక్రమాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి వరకు 770 పనులు చేపట్టి రూ.7.29 కోట్లు ఖర్చు చేశారు. వాటికి సంబంధించి సామాజిక తనికీ బృందం ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులు,కూలీలకు వెచ్చించిన ఖర్చు, అటవీ శాఖ తదితర అంశాలపై విచారణ చేశారు. ఈ సందర్భంగా నివేదికలను చదివి వినిపించారు. అయితే పనుల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించి కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.37,500 జరిమానా విధించగా రూ.10,683 రికవరీ అయినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొందరు ఎఫ్‌ఏలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఇలాంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీడీ సాంబశివ, క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాధర్, ఎస్‌ఆర్పీ కన్నారావు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటరాముడు,ఏపీఓ ప్రతాప్ ఉన్నారు.





ముకుందాపురం వద్ద కంకి దశలో కళకళలాడుతున్న మొక్కజొన్న పంట, సర్వాపురం వద్ద పచ్చగా పత్తి పైరు

పంటలకు ఊపిరి

రుద్రవరం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్‌లో భాగంగా ఈ ఏడాది రైతులు ముందస్తుగానే పంటలు సాగు చేశారు. అయితే వర్షాలు సరిగా కురవక పోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. బోరు బావుల నుంచి నీటి తడులు అందించినా, ఎండ తీవ్రత, వడగాడ్పులకు పంటలు ఎండుతున్నాయి. ఇప్పటికే మండలంలోని రుద్రవరం,రెడ్డిపల్లె,టీ.లింగందిన్నె,సర్వాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం, అప్పనపలె, ఎల్లావత్తుల, డి.కొట్టాల, శ్రీరంగాపురం, కోటకొండ తదితర గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, మిరప,పత్తి వంటి పంటలు సాగు చేశారు. పలువరు రైతులు వాడుముఖం పట్టిన పంటలను దున్నేశారు. ఈ తరుణంలో వర్షం కురవడంతో ఆ పైర్లకు ఊపిరి పోసినట్లయ్యింది.



ఆళ్లగడ్డలో ప్రత్యేక అలంకరణలో బాబా



ఆళ్లగడ్డలో భక్తులను ఆకట్టుకున్న బాబా నివాస పాక నమూనా



దొర్నిపాడులో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల

జ్ఞానామృతం పంచే గురుపౌర్ణమి

నంద్యాల(వ్యవసాయం): గురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని పలు దేవాలయాల్లో, ఆశ్రమాల్లో స్వామి వార్లను, గురువులను దర్శించుకొని, ఆశీస్సులు పొందారు. నాగులకుంట రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో షిర్డిసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయమే, పంచామృతాభిషేకాలు, విష్ణుసహస్ర నామాలు, విశేషాలంకారాలు, పూలంగిసేవ, మధ్యాహ్నం కాకడ హారతి నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. అలాగే.. బొమ్మసత్రం, జంబులాపరమేశ్వరి ఆలయ సమీపంలోని షిర్డిసాయిబాబా ఆలయాల్లో, కాశిరెడ్డినాయన ఆశ్రమం, స్పటిక లింగేశ్వర తదితర ఆలయాల్లో హోమాలు, అన్నదానాలు చేశారు.

గోస్పాడులో...

మండలంలో సోమవారం గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. గోస్పాడులో వ్యాసమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని ఎంవీ నగర్‌లో వెలసిన శ్రీ షిరిడి సాయి మందిరంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, అర్చనల అనంతరం బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో బాబాను, మందిరాన్ని అలంకరించారు. బాబా దర్శనానికి భక్తులు బారులుదీరారు.



నంద్యాలలో ప్రత్యేక అలంకరణలో కాశిరెడ్డి నాయన

చాగలమర్రి: స్థానిక శ్రీషిరిడి సాయినాథుని మందిరంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఆర్యవైశ్య సభ, అయ్యప్పస్వామి సేవా సమాజం, షిరిడిసాయి సేవా సమాజం సంయుక్తంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శైవ వేంకటనరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో సామూహిక షిరిడి సాయి సత్యవ్రతం చేపట్టారు.

దొర్నిపాడు: స్థానిక కాశిరెడ్డినాయన ఆలయంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమ్మిరెడ్డినగరం, రామచంద్రాపురంలో సాయిబాబాకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, డీలర్ శివుడు, కాకనూరు మనోహర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, నరిరెడ్డి, శివరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఎంపీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



రుద్రవరంలో సాయినాథునికి పూజలు చేస్తున్న భక్తులు



నంద్యాల స్పటిక లింగేశ్వర ఆలయంలో హోమ గుండానికి పూర్ణాహుతి ద్రవ్యాలు సమర్పిస్తున్న దృశ్యం



చాగలమర్రిలో సత్యవ్రతాన్ని ఆచరిస్తున్న దృశ్యం



బొమ్మలసత్రంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఉయ్యాలవాడలో గీతాపారాయణం...



చాగలమర్రిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని జగజ్జననీ మాతకు సోమవారం భక్తులు సారె సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

సమస్యలను పరిష్కరిద్దాం

దొర్నిపాడు: స్పందనకు వచ్చే అర్జీలకు వారికి వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తహసీల్దార్ జయప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన పాస్ పుస్తకాల మంజూరులో నిర్లక్ష్యం వద్దన్నారు. ఏఓ సునీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు

నంద్యాల(న్యూటౌన్): ఐసీడీఎస్ పథకానికి నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మలమ్మ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ, నిధులు కేటాయించాలని ఈనెల 10, 11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట 36 గంటల నిరసన దీక్ష నిర్వహిస్తామని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు.

రక్షణ కల్పించండి

నంద్యాల(న్యూటౌన్): గడివేముల గ్రామానికి చెందిన బూతవైద్యుడు విబూతి రమణయ్య నుంచి తమకు రక్షణ కల్పించాలని బాధితులు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం సీపీఐ నాయకులు మోటా రాముడు, సోమన్న, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బిలకలగూడూరు గ్రామంలో ఆరోగ్యం బాగా లేకపోతే రమణయ్య దగ్గరకు వెళ్లేవారన్నారు.ఇలా కొందరి నుంచి ఆయన రూ.10లక్షలు అప్పుగా తీసుకున్నాడని, తిరిగి చెల్లించాలని కోరితే క్షుద్రపూజల ద్వారా చేతబడి చేసి మహిళలను బెదిరిస్తున్నాడని ఎస్పీకి వివరించారు. బాధితులు మల్లేశ్వరి, వసుమతి, శారదా, సాలమ్మ, గంగ, కస్తూరి, రమణమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

దొర్నిపాడు: మండలకేంద్రానికి చెందిన సురేష్ అనే వ్యక్తి ఉయ్యాలవాడకు వెళ్లే దారిలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. అలాగే అతని వద్ద మట్కాచీటీలతో పాటు రూ.1500 నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

చెంచులను పట్టించుకోండి

నంద్యాల(అర్బన్): క్షయవ్యాధి బారిన పడి ఇబ్బందులు పడుతున్న వేంపెంట చెంచులను ఐటీడీఏ అధికారులు పట్టించుకోవడం లేదని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ఆరోపించారు. క్షయవ్యాధితో ఇటీవల వారంలో ఇద్దరు చెంచులు మృతి చెందడంతో ఆందోళన చెందుతున్నారని జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జీపీఎస్ నాయకులతో కలిసి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు.

నంద్యాల(న్యూటౌన్)/నంద్యాల(వ్యవసాయం): ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు తక్షణమే ఫిజికల్ ఈవెంట్స్ నిర్వాహించాలని డీవైఎఫ్‌ఐ నాయకులు లక్ష్మణ్, శివసోమవారం కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే.. తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ముస్లిం మైనార్టీలకు వర్తింపజేసినట్లే తమకు కూడా వైఎస్సార్ షాదీతోఫా అందజేయాలని దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు వాసవి దస్తగిరి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కోరారు.

అనుమతి పొందిన మందులనే విక్రయించాలి

దొర్నిపాడు: ప్రభుత్వం నుంచి అనుమంతి పొందిన బయో మందులను మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సునీత ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల యాజమానులకు సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ రైతుభరోసా కేంద్రంలో వారితో సమావేశం నిర్విహించారు. ఏఓ మాట్లాడుతూ ఒక్కో రైతుకు 20-25 బస్తాలకు మించి యూరియా విక్రయించరాదని సూచించారు. ధరల పట్టికతో పాటు ఎరువుల నిల్వలను సక్రంగా నిర్వహించాలని చెప్పారు. కాలం చెల్లిన ఎరువులు, విత్తనాలు విక్రయించరాదని, కొన్న వాటికి తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని వారిని ఆదేశించారు.

వేధింపుల కేసు నమోదు

చాగలమర్రి: వైఎస్సార్ కడప జిల్లా బద్వేలుకు చెందిన ముగ్గురిపై వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమణయ్య సోమవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని చిన్న వంగలి గ్రామానికి చెందిన సౌజన్యకు 2021లో బద్వేలుకు చెందిన పోకూరి శ్రీనాథ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే రెండున్నర సంవత్సాలు గడిచినా సంతానం కలుగలేదని భర్త, అత్త రమాదేవి, మామ వెంకటసుబ్బయ్య వేధిస్తున్నారని ఆరు నెలల క్రితం పుట్టింటికి వచ్చింది. సమస్యను పోలీసులకు తెలపడంతో చాగలమర్రి పోలీసులును శ్రీనాథ్‌ను పలుమార్లు స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిచి ఆమెను తీసుకెళ్లలేదు. వేధింపులు తీవ్రమవడంతో సోమవారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

అర్హులకు పథకాలు అందాలి

ఉయ్యాలవాడ : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై నుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులతో ఆయన మాట్లాడారు. గ్రామాలలో సమస్యలపై వచ్చిన అర్జీలను బాధ్యతగా స్వీకరంచి సత్వరమే న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ట్రాన్స్‌కో ఏఈ గురప్ప, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఫణీత్‌కృష్ణ, రామకృష్ణారెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



వేంపెంటలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శారదాబాయి

నంద్యాలటౌన్: వేంపెంట గ్రామంలో జిల్లా లెప్రసీ,టీబీ అధికారి డాక్టర్ శారదా బాయి సోమవారం గిరిజనులకు కుష్టు,టీబీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలు ఈ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్షిత నీటినే తాగాలని, జంతువుల సమీపంలో తిరుగుతున్నపుడు రక్షణగా చేతి తొడుగులు, ముఖానికి వస్త్రం కట్టుకోవాలని, శుభ్రమైన ఆహారం స్వీకరించాలని చెప్పారు. తీవ్రమైన దగ్గు, చర్మంపై దద్దుర్లు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. అనంతరం ఆమె ఇంటింటికి తిరిగి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.